క్లుప్తంగా

కార్మికులకు సీపీఎం అండగా ఉంటుంది



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు సీపీఎం అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని మంగళవారం సీపీఎం నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణలు సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగేంత వరకు తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలు ధైర్యంగా ముందుకు సాగాలని, 300 కుటుంబాలతో ముడిపడి ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుభాని, సూర్య ప్రకాశరావు, నాగేశ్వరరావు, సుబ్బారావు, కార్మికులు రమణమ్మ, శారద, సువర్ణకుమారి, భూలక్ష్మి, కాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

విస్తరణపై విస్తృత సమావేశం



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి తెనాలి రోడ్డు విస్తరణపై మంగళవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా స్థానిక వ్యాపారులు, మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మంగళగిరి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ ప్రణాళిక సిద్ధం చేశారని, దానిలో భాగంగా తెనాలి రోడ్డు విస్తరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ అధికారులు, చేనేత వ్యాపారులు, మత పెద్దలు పాల్గొన్నారు.

యర్రబాలెం గోశాలలో పరిశుభ్రతా చర్యలు



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెం శ్రీకృష్ణానంద ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల గోవుల మూత్రం, పేడతో నిండి దుర్వాసన వెదజల్లడంతో పాటు గోవులు మృత్యువాత పడుతున్నాయని పలు పత్రికలలో కథనాలు వెలువడడంతో మంగళవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా ఆధ్వర్యంలో డ్రోజర్, బాబ్‌కార్ట్‌ల సహాయంతో గోశాలను శుభ్రం చేశారు. గోశాలలో జరుగుతున్న పనులను ఏఈ ప్రవీణ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వరారావు గోవులకు అందిస్తున్న వైద్య సేవలను నిర్వాహకులు సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యపరంగా గోవులకు ఎటువంటి ఇబ్బందులు లేవని అన్నారు. గోశాలలో సరైన వసతి సదుపాయాలు లేవని అన్నారు. ఎంటీఎంసీ అధికారులు గోశాల ఆవరణలో ఉన్న గోమూత్రం, పేడను తొలగించి శుభ్రం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

మెదడు, నరాల వైద్య శిబిరానికి విశేష స్పందన



తాడికొండ: మంగళవారం తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మెదడు, నరాల ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుందరాచారి ఆదేశాల మేరకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి గుంటూరు మెడికల్ కాలేజీ న్యూరాలజీ నిపుణులు డా.భాను, డా.పవన్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 53 మందికి పరీక్షలు నిర్వహించగా నరాల బలహీనత, తలనొప్పి, పాక్షిక చలత, బీపీ, షుగర్ సమస్యలతో వచ్చిన రోగులకు మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈ వైద్య శిబిరంలో తాడికొండతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరు కాగా ప్రతి వారం నిర్వహించనున్నామని, సమీప గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యులు తెలిపారు. కార్యక్రమ

లేని స్పీడ్ బ్రేకర్లు.. విద్యార్థుల అవస్థలు

- మండలంలో ప్రమాదభరితంగా రోడ్లు
- పాఠశాలలు, కళాశాలల వద్ద లేని వేగ నియంత్రికలు
- వేగంగా వస్తున్న వాహనాలతో ప్రమాదాలు



వేములూరిపాడు వద్ద చిన్నారులను రోడ్డు దాటిస్తున్న ఉపాధ్యాయులు

ఫిరంగిపురం: మండల కేంద్రంతో పాటు వేములూరిపాడు గ్రామంలోని పలు పాఠశాలలు, కళాశాలల వద్ద వాహనాల వేగ నియంత్రికలు లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటాలంటే చాలా సేపు వేచి ఉండాల్సిన పరిస్థితి. వాహనాలు వేగంగా రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఏర్పాటు చేయని స్పీడ్ బ్రేకర్లు

సహజంగా ప్రతి పాఠశాల, కళాశాల వద్ద స్పీడు బ్రేకర్లు, వాటిని తెలిపే విధంగా పోస్టర్లు, జీబ్రా గీతలు ఏర్పాటు చేయాల్సి ఉంది. కాని హైవే అధికారులు ఎక్కడా వాటిని ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫిరంగిపురంలోని సెయింట్ ఆన్స్, సెయింట్ పాల్స్ పాఠశాల, మరో రెండు ప్రైవేటు పాఠశాలలు, మార్నింగ్‌స్టార్, దీనాపూర్ కళాశాలల వద్ద ప్రమాద సూచికలు గాని, వేగ నియంత్రికలు గాని లేవు. దీంతో వేగంగా వస్తున్న వాహనాలతో ఆయా ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లేని ప్రమాద సూచికలు

ప్రతి రోజు గుంటూరు-కర్నూలు రాష్ట్ర రహదారిపై వందలాది వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. వాహనదారులు వేగంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రమాద సూచికలు తెలిపే బోర్డులు గాని, వేగాన్ని నిరోధించే స్పీడు బ్రేకర్లు గాని లేవు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్డు దాటాలంటే అవస్థలు పడాల్సి వస్తుంది. కొన్ని పాఠశాలల వద్ద సాయంత్రం సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులను రోడ్డు దాటిస్తున్నారు. కొన్ని పాఠశాలల వద్ద రోడ్డు దాటే సమయంలో వేగంగా వస్తున్న వాహనాలు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలు, కళాశాలల వద్ద వేగాన్ని నిరోధించే విధంగా స్పీడు బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే ప్రమాదాలు సంభవించకుండా పోలీసులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



పాఠశాలల వద్ద రహదారిపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. రోడ్డు దాటాలంటే పెద్దలు దాటించాల్సి వస్తుంది. వేగంగా వస్తున్న వాహనాలతో రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

– డి.మణిశంకర్, విద్యార్థి తండ్రి

జాగ్రత్తలు తీసుకోవాలి



పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రమాద సూచికలు లేవు. రోడ్డు దాటాలంటే తల్లిదండ్రులు తీసుకురావాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో చిన్నారులే రోడ్డు దాటుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. జాగ్రత్తలు తీసుకోవాలి.

– బందా దాసయ్య, విద్యార్థి తండ్రి

చంద్రబాబు ప్రజలను వంచించారు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



వడ్డేశ్వరంలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వేమారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్, మంగళగిరి పట్టణ పరిధిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలో 12, 13 వార్డుల్లో నిర్వహించిన సభకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అధ్యక్షత వహించారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, కొలనుకొండలో రూరల్ అధ్యక్షుడు నాగయ్య అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు కూటమి నాయకులను ఇళ్లకు పంపి ఎన్ని పథకాలు వస్తాయి, ఎంత నగదు వస్తుందో వివరించారని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చే సంక్షేమ పథకాల కన్నా ఎక్కువ లబ్ధి చేకూరుతుందని ఆశ చూపించారని అన్నారు. గద్దెనెక్కిన తరువాత ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను వంచించారని అన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేడా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్, మైనార్టీ నాయకుడు ఇర్ఫాన్, ఉపాధ్యక్షులు గాలయ్య, ఎలీషా, ప్రధాన కార్యదర్శులు దుర్గారావు, స్నేహ సంధ్య, విజయశ్రీ, తాడేపల్లి రూరల్‌లో వైఎస్సార్‌సీపీ రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు పిచ్చిరెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, కృపారావు, మహిళా అధ్యక్షురాలు నాగ స్రవంతి, ఎస్సీ, ఎస్టీ, యువజన, విద్యార్థి నాయకులు మరియబాబు, వెంకటేశ్వరరావు, చంద్రశేఖరరెడ్డి, రమేష్, చంద్రరావు పాల్గొన్నారు.

మంగళగిరి పట్టణ పరిధిలోని 28వ వార్డులో కురగంటి ఆదాం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమానికి మంగళగిరి పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు విచ్చేసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయినా ఎటువంటి హామీలు అమలు చేయలేదని అన్నారు. కక్ష సాధింపు చర్యలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, సానుభూతి పరులపై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రజలను మోసం చేసి గెలిచి అబద్ధపు మాటలు చెప్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు సునీత, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కుబేరస్వామి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి సుధారాణి, పట్టణ ఉపాధ్యక్షుడు మహబూ, ఎస్సీ విభాగ అధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.

వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



తాడేపల్లిరూరల్ : జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్ 2025లో కేఎల్‌యూ విద్యార్థులు కాంస్య పతకాన్ని సాధించినట్లు యూనివర్శిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు జర్మనీలో జరిగిన వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్‌లో కేఎల్‌యూ నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారని, బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించారని అన్నారు. వైష్ణవి ఖడ్కేకర్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్‌లో ఏఆర్ రోహన్‌కుమార్ కాంస్య పతకం, మోహిత్ చౌదరి హాఫ్ మారథాన్‌లో 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పతక విజేతలను ప్రొ.వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, వ్యాయామ అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఎల్‌వోసీ చెక్కులు అందజేత

తాడేపల్లిరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుండి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరంకు చెందిన బోగల లీలా రాజేష్‌కు రూ.31,365, మహానాడు 23వ వార్డుకి చెందిన బెజవాడ లక్ష్మీప్రసన్నకు రూ.43,823, కేశవరెడ్డి ధనలక్ష్మికి రూ.77,100 చెక్కులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరిలో...

మంగళగిరి పట్టణ పరిధిలో 15వ వార్డుకు చెందిన అనారోగ్యం బాధపడుతూ చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్ మాట్లాడుతూ వినోద్ కుటుంబ పరిస్థితిని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు చేయించారని, చెక్కును ఆదిత్య తండ్రి వినోద్‌కు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో లింగ వివక్షపై అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న డాక్టర్ మస్తాన్ బీ షేక్



ప్రసంగిస్తున్న కీర్తిక

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో లింగ వివక్షపై అవగాహన సదస్సును కేఎల్‌యూ ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, స్పృహాస్తి ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గన్నవరం ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల వైద్యులు డాక్టర్ మస్తాన్‌బీ షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ ఆధారిత వివక్ష వివిధ రూపాల్లో కొనసాగుతున్నందున మహిళలకు, బాలికలకు సురక్షితమైన ప్రదేశాలను ఏర్పాటు చేయడం మన చేతుల్లోనే ఉందని అన్నారు. మహిళా సాధికారత సాధించడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బాలికలకు ఆత్మరక్షణపై అవగాహన

కేఎల్ యూనివర్శిటీలో ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళలకు, బాలికలకు ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆత్మరక్షణ శిక్షకురాలు కీర్తిక విచ్చేసి మాట్లాడుతూ మహిళలకు ఆత్మరక్షణ శిక్షణ తప్పనిసరని అన్నారు. అన్ని రంగాల్లో దూసుకు వెళుతున్న మహిళలు ఆత్మరక్షణలో శిక్షణ తీసుకోకపోవడం విచారకరమని అన్నారు. ప్రొ వీసీ డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సీఐ మీరా సాహెబ్

మేడికొండూరు: మండలంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ పాల్గొన్నారు. కళాశాలలో సీనియర్లు, జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కళాశాలలో ర్యాగింగ్ నిరోధించేందుకు ప్రత్యేక కమిటీని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. కళాశాలను ఒక దేవాలయంగా భావించాలని, ర్యాగింగ్‌ను నిరోధించేందుకు ప్రతి విద్యార్థి సహకరించి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలను నిషేధించాలని, మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలైన విద్యార్థులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం యాంటీ డ్రగ్ యాంటీ ర్యాగింగ్‌లపై ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ వద్దు.. వన్ వే ఏర్పాటు చేయండి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తెనాలి రోడ్డు విస్తరణపై ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావుకు మంగళవారం వినతి పత్రం అందించారు. అనంతరం స్థానిక వ్యాపారులు, మతపెద్దలు మాట్లాడుతూ తెనాలి రోడ్డుకు పలుచోట్ల మలుపులు ఉన్నాయని, రోడ్డు విస్తరణ అసాధ్యమని, బైపాస్‌రోడ్‌కు వెళ్లేందుకు వన్‌వే ఏర్పాటు చేయాలని, ప్రత్యామ్నాయంగా మరో రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల వ్యాపారులు నష్టపోకుండా ఉంటారని, ఖబరిస్తాన్‌లో ఉన్న పెద్దల జ్ఞాపకాలకు ఏమీ కాకుండా ఉంటాయని, తెనాలి రోడ్డు విస్తరణ ఆపివేసి వన్‌వే ఏర్పాటు చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పడవల మహేష్, శ్రీనివాసరావు, ముస్లిం ధార్మిక సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వరుస వాహన చోరీలతో ప్రజలు బెంబేలు

ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు గ్రామంలో రాత్రి సమయంలో వాహనాలు చోరీకి గురవుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నెలలో వరుస దొంగతనాలతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇంట్లో స్థలం లేని వారు తమ వాహనాలను ఇంటి ముందు నిలిపి తాళాలు వేస్తున్నారు. రాత్రి సమయంలో దొంగలు వాటిని తీసుకువెళుతుండటంతో వేలాది రూపాయలు నష్టపోతున్నామని వాహనదారులు చెబుతున్నారు. నెల నెలా ఎంతో కొంత నగదు చెల్లిస్తూ వాహనాలు కొనుగోలు చేసి చిన్న వ్యాపారాలు, పొలం పనులకు ఉపయోగించుకుంటున్నామని అవి చోరీకి గురవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాహనాల చోరీలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు



ఇ

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో విద్యుత్ చార్జీలు పెంచితే వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు తగ్గించకపోవడం విచారకరమని అన్నారు. మంత్రి నారా లోకేష్ గతంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రూ.9 వేల నుంచి రూ.18 వేల వరకు విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేస్తారని అన్నారు. స్మార్ట్ మీటర్ బిగిస్తే పూటకో రేటు వసూలు చేస్తారని అన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపుకు వ్యతిరేకంగా ప్రజానీకం కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు, సీపీఎం, సీపీఐ నాయకులు పల్లె కృష్ణ, డి.వి. విజయ భాస్కరరెడ్డి, సీరుడు దుర్గారావు, తుడిమెళ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ మహాసభను జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కేవీపీఎస్‌నాయకులు

తాడేపల్లిరూరల్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) గుంటూరు జిల్లా 6వ మహాసభ సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కేవీపీఎస్ నాయకులు తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేటలో మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు-సామాజిక న్యాయం అనే అంశంపై 6వ మహాసభలో సదస్సు నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన తరువాత క్రైస్తవులు, దళితులు, మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని అన్నారు. దళితుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పే పాలకులు ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో హోం మంత్రి దళిత మహిళ అయినప్పటికీ ఆమె పెత్తందారులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. బాధితులకు అండగా కేవీపీఎస్ అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఈ సదస్సులో దళిత క్రైస్తవ మైనార్టీ యువతీయువకులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వై.బర్నబాస్, మేరీ, కమలాకర్, నవీన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలకు ఎన్‌బీఏ టైర్ వన్ గుర్తింపు



మాట్లాడుతున్న కిట్స్ కళాశాల చైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు టైర్ వన్‌లో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. స్థానిక కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో సోమవారం చైర్మన్ మాట్లాడారు. అర్హత ఉన్న అన్ని బ్రాంచీలకు (సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ) గుర్తింపు లభించిందన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకూ మూడో సారి ఇలాంటి ప్రతిష్టాత్మకమైన ఎన్‌బీఏ గుర్తింపు కళాశాలకు దక్కినట్లు తెలిపారు. ఈ విజయంలో తమకు సహకరించిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. కళాశాల కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ.. జాతీయ సంస్థలు తమ కళాశాలకు ఇస్తున్న గుర్తింపు తమ కళాశాల నాణ్యాతా ప్రమాణాలకు ప్రతీక అని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మౌలికవసతులు కల్పించాలి



కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో కమిషనర్ లావణ్య వేణికి మంగళవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులు దయనీయమైన స్థితిలో ఉన్నారని అన్నారు. హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్‌ల్లో ఉంటూ భయాందోళనకు గురవుతూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వివరించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వార్డెన్, కుక్, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మహర్షి, రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ విభాగ కమిటీలు ఏర్పాటుచేయాలి

డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు



డైమండ్‌బాబుకు విన్నవిస్తున్న మస్తాన్‌వలి పార్టీ నేతలు

పట్నంబజారు: ఏ రాజకీయ పార్టీకైనా అనుబంధ విభాగాలే పట్టుగొమ్మలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, డైమండ్ బాబును కలిసి చర్చించారు. ఈ సందర్భంగా డైమండ్‌బాబు మాట్లాడుతూ పార్టీ జెండాను భుజానకెత్తుకుని పాటుపడిన ప్రతి ఒక్కరికి సముచితస్థానం దక్కేలా అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటు ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసి ప్రతి కార్యకర్తకి ప్రాధాన్యతనిచ్చేలా కమిటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ త్వరితగతిన కమిటీలు పూర్తి చేయాలని డైమండ్ బాబుకు విన్నవించటం జరిగిందన్నారు. అనుబంధ విభాగాల ఏర్పాటు ద్వారా పార్టీ మరింత బలోపేతం కానుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు మంగళగిరి పట్టణ పరిధిలోని భగత్‌సింగ్ నగర్, నిడమర్రు రోడ్, రైల్వేస్టేషన్ రోడ్, టిప్పర్ల బజార్, బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన చెప్పారు.